
ప్రజా పాలనలో అధికారులతో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్


మణికొండ హుడా కాలనీలో.. చైర్మన్ నరేందర్‌ముదిరాజ్


నార్సింగిలో.. అశోక్‌యాదవ్ తదితరులు

# ‘ప్రజా పాలన’కు దరఖాస్తుల వెల్లువ

- రెండో రోజు అదే జోరు
- కేంద్రాలను సందర్శించిన అధికారులు

**మైలార్‌దేవ్‌పల్లి:** ప్రజలకు అవసరమైన దరఖాస్తులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అధికారులకు సూచించారు. శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీలో నిర్వహిస్తున్న ప్రజా పాలనలో ఎమ్మెల్యే అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. దరఖాస్తు ఫారాలు దళారుల చేతికి ఇవ్వకుండా అర్హులైన ప్రజలకు అందేలా చూడాలని అన్నారు. రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్, బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రేమ్‌గౌడ్, కాశిగారి యాదగిరి, ప్రతాప్‌రెడ్డి, యంజాల శేఖర్, రామకృష్ణారెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

**ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

నిరుపేద ఇంటికి ఆరు గ్యారంటీలు అందేలా చూస్తామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ్ అన్నారు. శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీ జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలనలో ఆయన పాల్గొని ప్రజలకు దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా ధనంజయ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన అభయ హస్తం ఆరు గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ సర్కిల్ డీఈ శంకర్, డివిజన్ ఉపాధ్యక్షుడు బోల్ల వెంకటేష్, మహేష్, విజయ్, ఉదయ్‌కుమార్, రాజు, నిహాల్, సురేష్, నామాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవాలి**

**బండ్లగూడ:** ప్రజలంతా రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్‌లోని మజీద్ ఎ అలంగిర్, బస్తీ దవాఖానాలలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్, శ్రీనివాస్, ఆర్‌డీఎంఏ, ఏఈఈ రాజ్‌కుమార్, బిల్ కలెక్టర్ ఇమ్రాన్ పాల్గొన్నారు. ప్రజా పాలన సభలను సందర్శించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమం 2వ రోజు కొనసాగింది. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజా పాలన కార్యక్రమాల సభలను పరిశీలించారు. కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, కమిషనర్ బి.శరత్‌చంద్ర, 5వ డివిజన్ కార్పొరేటర్ షాపురం శ్రీనాథ్‌రెడ్డి, 7వ డివిజన్‌లో కార్పొరేటర్ క్యాతం పద్మావతి, 8వ డివిజన్‌లో కార్పొరేటర్ బి.భూపాల్‌గౌడ్‌ల అధ్యక్షతన ప్రజా పాలన సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌డీఎంఏ శ్రీనివాస్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఏడీ ఇన్‌చార్జి కె.శ్రీనివాస్, ఎస్‌ఈ ఆర్.శివనంద్, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈఈ వి.రాజ్‌కుమార్, టీటీఎంసీ ఎస్.శ్రీలత పాల్గొన్నారు.

**పథకాలతో లబ్ధి పొందాలి..**

**మణికొండ:** అర్హులందరూ సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకుని లబ్ధి పొందాలని మణికొండ మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేందర్‌ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు హుడాకాలనీలో కేంద్రాన్ని కమిషనర్ ఫల్గుణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. మణికొండ 19వ వార్డులో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, నార్సింగిలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు డి.కిరణ్, నాయకులు రాము, వినోద్, కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు దరఖాస్తు కేంద్రాల వద్ద పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, విద్యుత్ ఏఈ జ్ఞానేశ్వర్, కౌన్సిలర్ వందన నగేష్, కోఆప్షన్ సభ్యుడు సిద్దప్ప పాల్గొన్నారు.

**దరఖాస్తులను నింపేందుకు సహకరించాలి...**

ప్రజలు తమకు అవసరమైన పథకాలను సరిగా గుర్తించి దరఖాస్తు పత్రాల్లో నింపుతున్నారా, లేదా అనే విషయాన్ని వాటిని తీసుకునే సమయంలోనే సరిగ్గా నింపేందుకు వారికి సహకరించాలని మున్సిపల్ శాఖ అదనపు డైరెక్టర్ డి.జాన్ సాంసన్ ఆదేశించారు. శుక్రవారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రజా పాలన దరఖాస్తుల కేంద్రాలను జాయింట్ డైరెక్టర్ కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి, డీఈ నరసింహారాజు, మేనేజర్ యోగేష్ పాల్గొన్నారు.

**అర్హులందరికీ ఆరు గ్యారంటీలు..**

శంషాబాద్ రూరల్: అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందేలా అధికారులు కృషి చేయాలని రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నరేందర్ సూచించారు. మండలంలో కొనసాగుతున్న ‘ప్రజా పాలన’కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. పెద్దషాపూర్, ఘాంసిమియాగూడ, పెద్దగోల్కొండ, మదన్‌పల్లిలో పర్యటించారు. సర్పంచులు లక్ష్మయ్య, చంద్రశేఖర్, నాయకులు మహేందర్, గోవర్ధన్, నందు, ఆంజనేయులు, నర్సింహ పాల్గొన్నారు.

**5106 అర్జీలు..**

మండలంలో ప్రజా పాలన కార్యక్రమంలో రెండు రోజులుగా 5106 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ వసంత లక్ష్మీ తెలిపారు. షెడ్యూలు ప్రకారం ఆయా గ్రామాల్లో అధికారులు పర్యటించి అర్జీలు తీసుకుంటారని పేర్కొన్నారు.

**రెండో రోజు ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ..**

**శంషాబాద్:** రెండో రోజు ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆయా వార్డులో కొనసాగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. పట్టణంలోని 19 వార్డులో వార్డుల్లో జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, కౌన్సిలర్ సంజయ్ యాదవ్, ఆరో వార్డులో కుమార్ పాల్గొన్నారు.

**రాజేంద్రనగర్ సర్కిల్‌లో 18672 దరఖాస్తులు..**

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్‌లలో రెండవ రోజు శుక్రవారం 18672 దరఖాస్తులను స్వీకరించినట్లు ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. ఆరు హామీల పథకాల కోసం 14296 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అలాగే రేషన్‌కార్డుతో పాటు ఇతర వాటి కోసం 4376 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. సర్కిల్ పరిధిలోని అయిదు డివిజన్‌లలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద పూర్తి స్థాయిలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.


ప్రజలకు దరఖాస్తులను అందజేస్తున్న ధనుంజయ్


ప్రజా పాలనలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, కౌన్సిలర్ సంజయ్‌యాదవ్



బండ్లగూడలో ప్రజా పాలన సభలో మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్


కోకాపేటలో ప్రజలు నింపిన దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు


హైదర్షాకోట్‌లో .. డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కమిషనర్ శరత్‌చంద్ర


పెద్దషాపూర్‌లో అధికారులతో మాట్లాడుతున్న నరేందర్

## 31న పుప్పాలగూడలో అయ్యప్ప మహాపడి పూజ

**మణికొండ:** పుప్పాలగూడ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో 31వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి పుప్పాలగూడ శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజను నిర్వహిస్తున్నట్టు గురుస్వామి కె.బాల్‌రాజ్ ముదిరాజ్ తెలిపారు. అయ్యప్ప స్వామి మహా పడిపూజలో జడల రమేష్ భజన, రాములు ముదిరాజ్ అన్నదానం ఉంటుందని, గండిపేట మండల పరిధిలోని అయ్యప్ప స్వామి మాలాధారులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## 31న అన్ని ప్రధాన రహదారులలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం

**మైలార్‌దేవ్‌పల్లి:** మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి 8 గంటల నుంచి అన్ని ప్రధాన రహదారులలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. యువతీయువకులు అతిగా మద్యం సేవించి వాహనాలను నడుపరాదన్నారు. ఆరోజు రాత్రికి ఓఆర్ఆర్, ఫ్లైఓవర్‌లపై వాహనాలను నిషేధించామన్నారు. ప్రత్యేకంగా సీసీ కెమెరాలను అమర్చామని, మితిమిరిన వేగం, ట్రిపుల్ రైడింగ్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసిన వారిపై చర్యలు తప్పవని వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.


నర్సింహగౌడ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

## రవాణా శాఖమంత్రిని కలిసిన ఎస్సీసెల్ నేత

**శంషాబాద్:** రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ శుక్రవారం కలిశారు. ఆయన శంషాబాద్ పట్టణంలో నలభై ఏళ్ల కిందట అప్పటి కాంగ్రెస్ సర్కారు నిర్మాణం చేసిన ఆర్టీసీ బస్టాండ్‌ను నూతనంగా ఆధునీకరించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిందిగా కోరారు. అదే విధంగా ఎంజీబీఎస్ దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఆగేందుకు శంషాబాద్‌లో అత్యాధునిక బస్ టెర్మినల్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. దివంగత మాజీ ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శంషాబాద్‌లో బస్‌టెర్మినల్ ప్రతిపాదన చేసినట్లు గుర్తుచేశారు.



## విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

**రాజేంద్రనగర్:** విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి అధికారులు సిబ్బంది క్షేత్ర స్థాయిలో బాధ్యతగా పని చేస్తున్నారని టీఎస్ఎస్‌పీడీసీఎల్ రాజేంద్రనగర్ జోన్ సీజీఎం ఆనంద్ అన్నారు. శుక్రవారం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో విద్యుత్ అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం సీజీయం ఆనంద్ మాట్లాడుతూ.. వినియోగదారుల విద్యుత్ సమస్యలను వెనువెంటనే పరిష్కరించడాన్కి సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరుగకుండా ప్రజా పాలనలో ప్రజలు సమస్యలపై స్పందించాలని తెలిపారు.


ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న విద్యుత్ అధికారులు

## ఓఆర్ఆర్‌పై న్యూ ఇయర్ వేడుకలు నిషేధం

**శంషాబాద్:** ఔటర్ రింగురోడ్డుపై నూతన సంవత్సర వేడుకలు నిషేధమని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. సరుకు వాహనాలు తప్పా ఇతర వాహనాల కు 31న రాత్రి 10 నుంచి ఉద యం 6 గంటలకు వరకు అను మతి లేదన్నారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు.. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి వేడుకలను సజావు గా జరుపుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపరాదన్నారు. అదే విధంగా త్రిబుల్ రైడింగ్, మద్యం తాగి వాహనాలు నడకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

## లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**గచ్చిబౌలి:** డ్రంకన్ డ్రైవ్‌లో, డ్రైవింగ్ లైసెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నవారు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, రాయదుర్గం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ కోరారు. శనివారం కూకట్‌పల్లి కోర్టులో నిర్వహించే లోక్‌అదాలత్‌లో హాజరైతే కేవలం జరిమానాతో క్లోజ్ చేస్తారని వారు సూచించారు డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఉన్నవారు వారి ఆధార్‌కార్డు జిరాక్స్, లైసెన్స్, వెహికిల్ ఆర్‌సీలను,.. డ్రైవింగ్ లైసెన్స్ కేసులు ఉన్నవారు ఆధార్‌కార్డు, వెహికిల్ ఆర్‌సీ జిరాక్స్ తీసుకొని వచ్చి తమ కేసులను క్లోజ్ చేయించుకోవాలని వారు సూచించారు.

## వెల్లువెత్తుతున్న దరఖాస్తులు

**మణికొండ:** ప్రజా పాలనలో సంక్షేమ పథకాలకు ప్రజల దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం ప్రకటించిన ఐదు సంక్షేమ పథకాలకు 2185 దరఖాస్తులు రాగా ఇతరవి 59తో మొత్తం 2244 దరఖాస్తులు వచ్చాయి. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఐదు గ్యారంటీలకు 1817 దరఖాస్తులు రాగా ఇతర అవసరాలవి 519తో మొత్తం 2336 వచ్చాయి. మొదటి రోజు వేలాదిగా ధరఖాస్తులు తీసుకుని వెళ్లిన ప్రజలు శుక్రవారం నుంచి ఎక్కువ సంఖ్యలో తిరిగి కేంద్రాలలో అందజేస్తున్నారని మున్సిపల్ కమిషనర్‌లు బి.సురేందర్‌రెడ్డి, కె. ఫల్గుణ్‌కుమార్‌లు తెలిపారు. దరఖాస్తు పత్రాలను ఆయా వార్డు కేంద్రాలలో ఉచితంగా ఇస్తున్నామని, జిరాక్స్‌లు తీసుకోవద్దని వారు సూచించారు. ఎవరైనా దరఖాస్తు పత్రాలను విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

## లింగంపల్లి బ్రిడ్జి కల్వర్టు పనులు పరిశీలన

**శేరిలింగంపల్లి:** లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద వరద ముంపు సమస్య పరిష్కారానికి రూ.4 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన బాక్స్ కల్వర్టు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ గౌరవాధ్యక్షులు వీరేశంగౌడ్, బీఆర్ఎస్ నాయకులు రాజుయాదవ్, పద్మారావు, యాదగిరిగౌడ్, నటరాజ్, గోపాల్‌యాదవ్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పాలి

భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**రాయదుర్గం:** శాస్త్రీయ నృత్యకళలు, భారతీయ సంస్కృతిని ప్రపంచానికి మరింతగా చాటి చెప్పాల్సిన అవసరం ఉందని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి డాక్టర్ రామినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో శ్రీద వరాళి చదలవాడ కూచిపూడి రంగప్రవేశం ఆద్యంతం అందరినీ ఆకట్టుకునేలా సాగింది. వినాయకనిను విన అంటూ నర్తకి తొలి నాట్య ప్రదర్శన అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. వెంకయ్యనాయుడు నృత్యప్రదర్శనను తిలకించి ఆమెను ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యాలైన కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ తదితరాలను మనం కాపాడుకోవాలని, మన పిల్లలకు నేర్పించే బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ రఘురామకృష్ణంరాజు, రామినేని ఫౌండేషన్ చైర్మన్ ధర్మప్రచారక్ రామినేని, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి, సినీ దర్శకులు రాఘవేంద్రరావు, మాజీ కేంద్ర విజిలెన్స్ కమిషనర్ కేవిచౌదరి, సినీ నృత్య దర్శకులు కెవి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండో పోటీలకు ఒయాసిస్ స్కూల్ బాలికలు

**రాయదుర్గం:** తైక్వాండో జాతీయస్థాయి పోటీలకు రాయదుర్గంలోని ఒయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ బాలికలు ఎంపికయ్యారు. స్కూల్‌లో పదవ తరగతి చదివే ఆధ్యామేఘన అండర్–17 బాలికల విభాగంలో బంగారు పతకం, ఆరవ తరగతి చదివే సమన్విత అండర్–14 బాలికల విభాగం తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలో బంగారు పతకాలను సాధించారు. వీరు వికారాబాద్ జిల్లా తాండూరులో జరిగిన పోటీలలో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలు సాధించడంతో వారిద్దరిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి పోటీలను మధ్య ప్రదేశ్ రాష్ట్రం బేతుల్‌లో డిసెంబర్ 31 నుంచి జనవరి 5వ తేదీ వరకు ఈ పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో రాష్ట్రం నుంచి వీరిద్దరు పోటీల్లో పాల్గొంటారు. వీరిద్దరిని ఒయాసిస్ స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపల్, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

## బాక్స్ డ్రైన్ పనులతో ట్రాఫిక్ మళ్లింపు

**మణికొండ:** ప్రధాన రోడ్డుపై బాక్స్ డ్రైన్ పనులను ప్రారంభించటంతో ట్రాఫిక్‌ను మళ్లించారు. కాలనీలలో ఉన్న రోడ్లు ఇరకుగా ఉండటం, స్కూల్ బస్సులు, ఇతర వాహనాల రద్దీతో అడుగడుగునా ట్రాఫిక్ జాంలు ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ నుంచి హరివిల్లు అపార్ట్‌మెంట్ ముందు ఉన్న పందెన్ వాగుకు బాక్స్ డ్రైన్ పనులను రూ.9 కోట్లతో చేపట్టారు. అవి ప్రస్తుతం మర్రిచెట్టు నుంచి ఓయూ కాలనీ వైపు వెళ్లే రోడ్డులో కొనసాగించాల్సి ఉంది. వాటిని శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభించారు. వాహనాలను పంచవటి, భాగ్యలక్ష్మి కాలనీల మీదుగా మళ్లించారు. ఆయా కాలనీల మీదుగా ఉన్న రోడ్లు ఇరుకుగా ఉండటం, ప్రధాన రోడ్డులో ప్రతిరోజూ వేలాది వాహనాలు ప్రయాణాలు సాగిస్తుండటంతో అవన్నీ ఆ వీదులగుండా వెలుతుండటంతో అడుగడుగున ట్రాఫిక్ జాంలు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఎటువైపు వెళ్లాలో తెలియక గంటల సమయం ట్రాఫిక్‌లో గుడుపుతున్నారు. ఆయా కాలనీల్లో రోడ్డును సూచించే బోర్డులను ఏర్పాటు చేయకపోవటంతో కొత్త వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు మార్గాలను తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రధాన రోడ్డుపై చేపట్టిన పనులను రాత్రి, పగలు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


ట్రయల్స్ విల్లాల ముందు తవ్వుతున్న రోడ్డు

## విద్యార్థి అదృశ్యం

**శంషాబాద్ రూరల్:** విద్యార్థి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..పాల్మాకులకు చెందిన సుమంత్(16) ఈనెల 27న రోజు మాదిరిగానే స్థానికంగా ఉన్న చైతన్య టెక్నో స్కూలుకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి ఉదయం బయలుదేరాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. అన్ని చోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


సుమంత్

# పొంచి ఉన్న ప్రమాదం

- శిథిలావస్థలో విద్యుత్ సంభాలు, కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు
- భయాందోళనలో స్థానికులు
- పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- వెంటనే విద్యుత్ మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్

**మైలార్‌దేవ్‌పల్లి:** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ శ్రీ మల్లికార్జుననగర్ కాలనీలో రెండేళ్లుగా కాలనీలోని విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. పాత స్తంభాలు ఓ పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ తీగలు కిందికి వేళాడుతున్నాయి. ఎత్తైన వాహనాలకు తగిలే విధంగా ఉన్నాయని స్థానికులు అంటున్నారు. అధికారులకు, లైన్ మెన్‌లకు అనేక మార్లు ఫోన్ ద్వారా, వాట్సాప్ ద్వార ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని అధికారులపై స్థానికులు మండిపడుతున్నారు. కాలనీలో విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడే అతృత చూపిస్తారు తప్పా ప్రమాదం పొంచి ఉందని ఫిర్యాదు చేస్తే పెడచెవిన పెడుతున్నారని వాపోతున్నారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్న కాలనీలో ప్రమాదకర విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మలు ఏదైన ఉన్న వెంటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు కాలనీలో అనేకం ఉన్నాయని వాటిని తొలగించి వేరే స్తంభాలు వేయాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడికె మహేందర్ ప్రజా పాలనలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రమాదం జరగక ముందే అధికారులు గుర్తించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


విద్యుత్ ఏఈకి వినతి పత్రం అందజేస్తున్న కాలనీ అధ్యక్షుడు


ఓ పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం

### సమస్య పరిష్కరించండి..

రెండు సంవత్సరాలుగా కాలనీలో అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ వైర్లు కిందకు వేళాడుతున్నాయి. అధికారులకు అనేక మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ప్రజా పాలనలో విద్యుత్ సమస్యను అధికారులకు దృష్టికి తీసుకెళ్లా. సమస్యను గుర్తించి పరిష్కరించాలని కోరుతున్నా.

–అడికె మహేందర్, మల్లికార్జుననగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు



## నేత్రపర్వం.. నృత్య ప్రదర్శనలు



**మాదాపూర్:** శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళాలో భాగంగా శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ సౌజన్యంతో రాజస్థాన్‌కి చెందిన కిరణ్ బృందం చక్రి నృత్యంతో ఆకట్టుకున్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన జానపద నృత్యం కర్గం, కావడి, తప్పాటం అంశాలు ఆకట్టుకున్నాయి. వనజా ఉదయ్ శిష్యబృందం, కరుణ శిష్యబృందాలు కూచిపూడి నృత్యప్రదర్శనలతో అలరించారు. కోల్‌కత్తాకు చెందిన డాక్టర్ దెబీజాని ఛటర్జీ బృందం ప్రదర్శించిన భరత నాట్యాంశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

